ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

తమిళనాడు TAMILNADU

మంగళవారం 21 జనవరి 2025

● రిటర్న్ జర్నీ ఎఫెక్ట్..

ముగిసిన సెలవులు
తిరిగి వస్తున్న ప్రజలు

● జీఎస్టీ రోడ్డులో ట్రాఫిక్ రద్దీ
● 2 కిమీ మేరకు నిలిచిన వాహనాలు



చెన్నై శివారులో ట్రాఫిక్ రద్దీ

అడయార్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ యేడాది పొంగల్ సెలవులు ఏకంగా తొమ్మిది రోజుల పాటు రావడంతో లక్షలాది మంది నగర వాసులు తమ సొంతూళ్ళకు క్యూకట్టారు. వీరంతా శనివారం రాత్రి నుంచి తిరిగి నగరానికి వస్తున్నారు.. దీంతో జీఎస్టీ రహదారిలో వాహనాల రద్దీ నెలకొంది. ఈ కారణంగా రెండు కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ స్తంభించింది. అదేవిధంగా తొమ్మిది రోజుల సెలవుల తర్వాత సోమవారం రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు తెరుచుకున్నాయి. ఈ యేడాది పొంగల్ సెలవులు ఏకంగా తొమ్మిది రోజులు వచ్చాయి. దీంతో సుమారు 15 నుంచి 18 లక్షల మంది నగరవాసులు పొంగల్ పండుగ కోసం తమ స్వగ్రామాలకు వెళ్ళారు. దీంతో చెన్నైలోని రహదారులన్నీ బోసిబోయాయి. అయితే, సంక్రాంతి సెలవులు ముగియడంతో సోమవారం నుంచి విద్యా సంస్థలు, కార్యాలయాలు తెరుచుకున్నాయి. దీంతో సొంతూళ్ళకు వెళ్ళిన నగర వాసులు తిరిగుముఖం పట్టారు. ట్రాఫిక్ సమస్యలో చిక్కుకోకుండా కొందరైతే శనివారం సాయంత్రం నుంచే నగరానికి తిరిగి వచ్చారు. సోమవారానికి ఎక్కువ మంది రావడంతో జీఎస్టీ రహదారిపై రద్దీ ఏర్పడింది. దక్షిణాది జిల్లాల నుంచి వచ్చే వాహనాల కారణంగా తిరుచ్చి, విల్లుపురం, కళ్ళకుర్చి, కాంచీపురం, చెంగల్పట్టు తదితర జిల్లాల్లో ఉన్న టోల్‌ప్లాజాల వద్ద వాహనాలు బారులు దీరాయి. శనివారం సాయంత్రం నుంచి ప్రారంభమైన రద్దీ సోమవారం ఉదయం వరకు కొనసాగింది. మధురాంతకం సమీపంలోని ఆత్తూరు, చెంగల్పట్టు సమీపంలోని పరనూరు టోల్ ప్లాజాల్లో వాహనాల రద్దీ అధికంగా కనిపించింది. గత వారం పది రోజులుగా వాహనాల శబ్దం లేకుండా ప్రశాంతంగా కనిపించిన చెన్నై నగరంలోని ప్రధాన కూడళ్లలో వాహనాలు అధిక సంఖ్యలో కనిపించాయి.

పరందూరు ఎయిర్‌పోర్ట్‌పై
ప్రభుత్వానిది
కపటనాటకం

● అన్నదాతలకు అండగా ఉంటా
● అవసరమైతే న్యాయపోరాటానికి సిద్ధం
● రైతుల ఆశీస్సులతోనే ప్రచారం ప్రారంభం
● పరందూర్ రోడ్ షోలో టీవీకే అధినేత విజయ్



పరందూరులో వ్యాన్‌పై నుంచి మాట్లాడుతున్న విజయ్

చెన్నై, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పచ్చటి పొలాలతో కళకళలాడుతున్న పరందూరు సహా 13 గ్రామాల రైతులకు అండగా ఉండాల్సిన రాష్ట్ర ప్రభుత్వం.. ఎవరినో సంతృప్తి పరిచేందుకు విమానాశ్రయ ప్రాజెక్టు అమలు చేయడానికి ప్రయత్నిస్తోందని 'తమిళగ వెట్రి కళగం' నేత, నటుడు విజయ్ ధ్వజమెత్తారు. సోమవారం మధ్యాహ్నం పరందూరు ఎయిర్‌పోర్టు ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ 900 రోజులకు పైగా ఆందోళనలు చేస్తున్న పరందూరు, ఏకనాపురం సహా 13 గ్రామాల ప్రజలు, రైతులనుద్దేశించి ఆయన ప్రచార వ్యాన్‌పై నుంచి ఉద్వేగంగా ప్రసగించారు. విక్రవాండిలో పార్టీ మహానాడు తర్వాత ఆయన తొలిసారిగా తన రాజకీయ ప్రచారయాత్రకు పరందూరు నుంచి శ్రీకారం చుట్టారు. పరందూరులోని ఓ కల్యాణమండపం వద్ద గ్రామస్థులు, రైతులు, మహిళలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ కొత్త విమానాశ్రయం ఏర్పాటుకు తాను వ్యతిరేకం కాదని, పంటపొలాలు, చెరువులు, వాగులతో సస్యశ్యామలంగా ఉన్న పరందూరు పరిసర ప్రాంతాలకు బదులు మరో చోట ఈ విమానాశ్రయాన్ని నిర్మిస్తే బాగుంటుందన్నారు. 900 రోజులకు పైగా పరందూరు పరిసర గ్రామాల ప్రజలు చేస్తున్న ఆందోళనలపై రాహుల్ అనే బాలుడి ప్రసంగం వీడియో చూసిన తర్వాత ఇక్కడికి వచ్చి ఆందోళనకారులను కలుసుకోవాలని నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. పరందూరు సహా 13 గ్రామాలకు చెందిన అన్నదాతలకు తాను అండగా ఉంటానని, ఈ విమానాశ్రయ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ న్యాయపోరాటం చేసేందుకు కూడా తాను సిద్ధమేనన్నారు. తాను అన్నదాతల పాదాలకు నమస్కరించి తన రాజకీయ ప్రచార యాత్రను ప్రారంభిస్తున్నానని వెల్లడించారు. పార్టీ తొలి మహానాడులో పర్యావరణాన్ని కాపాడేందుకు పాటుపడతామని, వ్యవసాయ భూములను కాపాడతామని ప్రత్యేక తీర్మానాలు చేసిన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఎయిర్‌పోర్ట్ నిర్మించి ఈ గ్రామాలను ఎడారిగా మార్చటమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా ఉన్నట్టు కనిపిస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తానొక ముఖ్యమైన విషయాన్ని చెప్పదలచుకున్నానని, తాను అభివృద్ధి పథకాలకు వ్యతిరేకిని కానని, ఆ అభివృద్ధి పథకాలను ప్రజలకు ఎలాంటి నష్టం కలుగని ప్రాంతాల్లో చేపట్టాలన్నదే అతన అభిమతమన్నారు. రాజధాని నగరం చెన్నై సహా పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలకే వరద పరిస్థితులు కలగటానికి నీటి వనరుల దురాక్రమణే కారణమని నిపుణులు చెబుతున్నారని, కనుక పొలాలను, కర్షకజీవులను కాపాడేందుకే వచ్చానని చెప్పారు. టంగ్‌స్టన్ తవ్వకాల ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం. .ఈ విమానాశ్రయ ప్రాజెక్టుకు మద్దతుగా ఉండటం గర్హనీయమన్నారు.

గెలుపు మనదే..

పరందూరు పరిసర గ్రామాలకు చెందిన రైతులంతా మంచే జరుగుతుందని, అంతిమ విజయం తమదేనన్న నమ్మకంతో ఉండాలని, తమ పోరాటాన్ని ఎట్టి పరిస్థితులలో ఆపకుండా కొనసాగించాలని విజయ్ పిలుపునిచ్చారు. మీ ఇంటి బిడ్డగా తాను విమానాశ్రయ ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకిస్తానని, మరోమారు ఏకనాపురానికి వస్తానని తెలిపారు. ఈ గ్రామాల్లో తాను పర్యటించకుండా పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారో అర్థం కావటం లేదన్నారు.

ఆందోళనకారుల్లో ఉరకలేసిన ఉత్సాహం...

టీవీకే నేత విజయ్ రాకతో పరందూరు, ఏకనాపురం తదితర గ్రామాలకు చెందిన ఉద్యమకారుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రచార వ్యాన్‌పై నిలిచి పార్టీ జెండా పట్టుకుని వస్తున్న విజయ్‌కు రైతులు, గ్రామస్థులు, మహిళలు జేజేలు పలికారు. విజయ్ రోడ్‌షోలో పాల్గొనే నిమిత్తం అక్కడి కల్యాణమండపానికి వచ్చిన పరందూరు, ఏకనాపురం తదితర 13 గ్రామాల వారిని పోలీసులు ఆధార్‌కార్డులను పరిశీలించిన మీదటే అనుమతించారు. ఎండవేడి అధికంగా ఉండటంతో పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ అందరికీ టోపీలు, వాటర్‌బాటిల్స్‌ను పంపిణీ చేశారు. కాగా సుమారు వందమందికి పైగా రైతులు విజయ్‌ని చూడటానికి చేత వరికంకులు పట్టుకుని రావడం విశేషం.

రెండాకుల గుర్తు వ్యవహారం ...
సుప్రీంలో ఈపీఎస్ విజయం



ప్యారీస్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పదవి, రెండాకులు గుర్తు వ్యవహారంలో కేంద్ర ఎన్నికల కమిషన్ చర్యలను తాత్కాలికంగా నిలిపివేస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)కు మద్దతుగా అత్యున్నత న్యాయస్థానం సోమవారం ఇచ్చిన ఉత్తర్వులను స్వాగతించిన ఆ పార్టీ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. అన్నాడీఎంకే రాష్ట్రస్థాయి కార్యవర్గ కమిటీ సమావేశం ఆమోదించిన తీర్మానాలు, పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఈపీఎస్ ఎంపికను వ్యతిరేకిస్తూ హైకోర్టులో వేసిన కేసు విచారణలో ఉంది. ఇందువల్ల పెండింగులో ఉన్న కేసులు పూర్తయ్యేవరకు అన్నాడీఎంకేకు రెండాకుల గుర్తు కేటాయించరాదని కోరుతూ ఆరుగురు వేర్వేరుగా కేంద్ర ఎన్నికల కమిషన్‌కు వినతిపత్రాలు సమర్పించారు. వీటిపై విచారణ జరపనున్నట్లు ఈసీ ప్రకటించిన నేపథ్యంలో, విచారణపై స్టే విధించాలని కోరుతూ, అన్నాడీఎంకే తరఫున మద్రాస్ హైకోర్టులో ఓ కేసు దాఖలైంది. దానిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. ఈపీఎస్ పదవి, రెండాకుల గుర్తుకు సంబంధిన కేసు సుప్రీంకోర్టులో పెండింగులో ఉండగా, ఈసీ ఎలా చర్యలు తీసుకుంటుందని, ఈసీ చర్యలపై స్టే విధిస్తూ గత 9వ తేదీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఎంజీ రామ చంద్రన్ అనే వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ అప్పీలు పిటిషన్ న్యాయమూర్తులు దిబాంకర్ దత్తా, మన్మోహన్‌తో కూడిన ధర్మాసనం ముందు సోమవారం విచారణకు వచ్చింది. ఇరు తరుపు వాదనల అనంతరం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పదవి, రెండాకుల గుర్తు వ్యవహారంలో మద్రాస్ హైకోర్టు ఉత్తర్వుల్లో తాము జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసిన ధర్మాసనం.. అప్పీలు పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో పిటిషనర్ తన పిటిషన్ ఉపసంహరించుకుంటానని అభ్యర్థించడంతో అందుకు అంగీకరించింది.

సమీపిస్తున్న రిపబ్లిక్ డే ...

విమానాశ్రయానికి
ఐదంచెల భద్రత

● అడుగడుగునా తనిఖీలు



వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐఎస్ఎఫ్ బలగాలు

ప్యారీస్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): భారతదేశ 76వ రిపబ్లిక్‌డే వేడుకలను ఈ నెల 26న ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రాజధాని నగరం చెన్నైలో జాతీయ, అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ఐదంచెల భద్రత సోమవారం ఉదయం నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో ఈ నెల 30వ తేదీ వరకు ఈ విమానాశ్రయాల్లో సీఎస్ఐఎఫ్, రిజర్వు పోలీసు, కమాండో, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు వాహనాల తనిఖీ చేస్తారు. 24, 25, 26 తేదీల్లో గరిష్ఠస్థాయిలో ఏడంచెల భద్రతా విధానాన్ని అమలుపరచనున్నట్లు ఎయిర్‌పోర్టు అథారిటీ అధికారులు తెలిపారు. విమానాశ్రయాలకు ప్రయాణికులు వచ్చే వాహనాలను ప్రధాన ప్రవేశ ద్వారం వద్దే నిలిపి డాగ్ స్క్వాడ్ తనిఖీ చేస్తున్నారు. వీరికి బాంబు స్క్వాడ్, పోలీసులు కూడా సహకరిస్తున్నారు. ఈ బృందాలు విమానాశ్రయ ప్రాంగణం, కారు పార్కింగ్ ప్రాం తాల్లో మెటల్ డిటెక్టర్ల సహాయంతో తనిఖీలు చేస్తున్నారు. కాగా, ఎయిర్‌పోర్టు అథారిటీ గుర్తింపు కార్డులున్న ఉద్యోగులను మాత్రమే లోపలికి అనుమతిస్తున్నారు. రిపబ్లిక్‌డే సందర్భంగా నిబంధనలను కఠినతరం చేయడంతో విమానాలకు ఇంధ నం నింపే ప్రాంతాల్లో ఆర్మ్‌డ్ ఫోర్స్‌తో నిఘా వేశారు. ఆ ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాలతో పాటు అదనంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. విమానాశ్రయంలో భద్రత కంట్రోల్ రూమ్ నుండి 24 గంటలు షిఫ్ట్ విధానంలో పర్యవేక్షిస్తున్నారు. ప్రయాణికుల బ్యాగేజీ, పార్సిల్స్‌ను స్కానర్ల ద్వారా తనిఖీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే 30వ తేదీ వరకు అదనంగా తనిఖీలు నిర్వహిస్తున్నందువల్ల డొమెస్టిక్ ప్రయాణికులు గంటన్నర ముందు, విదేశాలకు వెళ్లేవారు మూడు గంటల ముందుగా విమానాశ్రయాలకు చేరుకోవల్సిందిగా అధికారులు సూచించారు. గణతంత్ర వేడుకల సందర్భంగా ఈ విమానాశ్రయాలు పోలీసుల భద్రతా వలయంలోకి రావడం గమనార్హం. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రధాన రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ఆలయాలు, మసీదులు, చర్చీలు, ప్రముఖ పర్యాటక పర్యాటక కేంద్రాల్లో పోలీసు బృందాలు ముమ్మరంగా తనిఖీలు ప్రారంభించారు.

అది మార్ఫింగ్ ఫొటో

● ప్రభాకరన్‌తో సీమాన్ ఫొటోపై డైరెక్టర్ శంగగిరి వివరణ
● నామ్ తమిళర్ కట్చి ఖండన



ప్రభాకరన్‌తో సీమాన్ (పాతఫొటో)
ఇన్‌సెట్‌లో శంగగిరి రాజ్‌కుమార్

టి.నగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నామ్ తమిళర్ కట్చి నేత, సినీ దర్శకుడు సీమాన్ ఎల్టీటీఈ నేత వేలుపిళ్లై ప్రభాకరన్‌తో ఉన్న పాత ఫొటో మార్ఫింగ్‌దని 'వెంగాయం' సినీ దర్శకుడు శంగగిరి రాజ్‌కుమార్ ఆరోపించారు. ప్రభాకరన్‌తో సీమాన్ ఉన్న ఫొటో ఎడిట్ చేసింది తానేననంటూ బాంబు పేల్చారు. ఈ మేరకు శంగరిరి రాజ్‌కుమార్ తన ఎక్స్ పేజీలో ఓ ప్రకటన విడుదల చేశారు. వాస్తవంగా 'ఈయన (సీమాన్) ఆయనను (ప్రభాకరన్‌ను) కలుసుకోలేదని, ఇలా ఎందుకు చెబుతున్నానంటే ఈ ఫొటో ఎడిట్ చేసి ఇచ్చింది తానేనని పేర్కొన్నారు. ఆ ఫొటో గురించి మీడియాతో ఆయన ప్రస్తావిస్తూ తొలినాళ్లలో తాను ఓ ప్రైవేటు టీవీ ఛానెల్‌లో పనిచేస్తుండేవాడినని, ఆ ఛానెల్‌లోనే సీమాన్ స్నేహితుడు కూడా పనిచేస్తుండేవాడని, ఓ రోజు ఆయన ప్రభాకరన్‌తో దర్శకుడు మహేంద్రన్ తదితరులు కలిసి తీసుకున్న ఫొటోలు ఉన్న డీవీడీ, సీమాన్ ఫొటో ఇచ్చారని తెలిపారు. డీవీడీలోని ప్రభాకరన్ ఫొటోలను ఉపయోగించిన ఆయన పక్కనే సీమాన్ నిలిచిఉన్నట్లు ఓ ఫొటోను తయారు చేసి ఎడిట్ చేసి ఇవ్వమని చెప్పారని, ఆ ప్రకారమే తాను ఫొటో చేసి ఇచ్చానని శంగగిరి రాజ్‌కుమార్ తెలిపారు. ఆ ఫొటోని గమనిస్తే సీమాన్ వెనుక నీడ ఉంటుందని, అయితే ప్రభాకరన్ వెనుక నీడ ఉంచేందుకు మరచిపోయానని చెప్పారు. కొద్ది రోజుల తర్వాత ఆ ఫొటోను ఏం చేశారని సీమాన్ స్నేహితుడిని అడిగినప్పుడు ఆ ఫొటో వల్లే రాష్ట్రంలో కొత్త రాజకీయ నాయకుడు (సీమాన్) పుట్టుకొచ్చాడని తనకు చెప్పాడన్నారు. శంగగిరి రాజ్‌కుమార్ చేసిన ఈ ఆరోపణలను నామ్ తమిళర్ కట్చి తీవ్రంగా ఖండించింది. ఆ పార్టీ ప్రముఖుడు సాట్టై దురైమురుగన్ తన ఎక్స్ పేజీలో ఓ ప్రకటన చేస్తూ ఆ ఫొటోను నకిలీదని చెబుతున్న శంగగిరి రాజ్‌కుమార్‌కు తమ వద్ద సీమాన్ ప్రభాకరన్‌తో తీసుకున్న ఆరేడు ఫొటోలున్న సంగతిని మరచిపోయినట్లుందని, ఇకనైనా ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలంటూ హితవుపలికారు.

మాజీ మంత్రికి
హైకోర్టులో ఊరట

● జస్టిస్ ఆరుముగసామి కమిటీ నివేదికలో వివరాల రద్దు



మాజీ మంత్రి డాక్టర్ విజయభాస్కర్

చెన్నై, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జయలలిత మృతిపై విచారణ జరిపిన జస్టిస్ ఆరుముగసామి కమిటీ నివేదికలో మాజీమంత్రి విజయభాస్కర్‌పై పలు అనుమానాలున్న వ్యాఖ్యలు, వివరాలను తొలగిస్తూ హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జస్టిస్ ఆరుముగసామి కమిటీ నివేదిక ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ఆ కమిటీ జయ మృతి చెందినప్పుడు ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న విజయభాస్కర్‌ను కూడా విచారణ జరపాలని సిఫారసు చేసింది. ఆ నేపథ్యంలో విజయభాస్కర్ హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో పిటిషన్ వేశారు. అందులో 2013 నుంచి 2021 వరకు తాను ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేశానని, మాజీ ముఖ్యమంత్రి జయ మృతిపై విచారణ జరిపిన జస్టిస్ ఆరుముగసామి కమిటీ తనను ఓ సాక్షిగా పిలిచి విచారణ జరిపిందని, చివరకు ఆ నివేదికలో తన గురించి అభ్యంతరకరమైన వ్యాఖ్యలు నమోదై ఉన్నట్లు తెలుసుకుని దిగ్భ్రాంతి చెందానన్నారు. ఆ కమిటీ నివేదికలో 39.1, 39.7, 47.28 పుటలో ఉన్న తనకు సంబంధించిన వివరాలు, కమిటీ చేసిన ఆరోపణలు, వివాదాస్పదమైన వ్యాఖ్యలను రద్దు చేయాలని విజయభాస్కర్ విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్ విచారణకు స్వీకరించిన హైకోర్టు ఆ కమిటీ నివేదికలో మాజీమంత్రి విజయభాస్కర్‌కు సంబంధించిన వివరాలను ఎవరూ వెల్లడించకుండా, ప్రసారమాధ్యమాల్లో వాడకుండా ఉండేలా కొద్ది నెలల క్రితం స్టే విధించింది. ఈ నేపథ్యంలో జస్టిస్ ఆరుముగసామి కమిటీ నివేదికలో మాజీ మంత్రి విజయభాస్కర్‌కు సంబంధించిన వివరాలు, ఆరోపణలను రద్దు చేస్తూ న్యాయమూర్తి ఇలంతిరయన్ ఉత్తర్వులు జారీ చేశారు.

సమాచార దర్శిని

ఓటరు కార్డు అప్డేట్స్‌పై అవగాహన

ప్యారీస్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఓటర్లు తమ ఓటరు గుర్తింపు కార్డులో మార్పులు సొంతంగా చేసుకునే సదుపాయాన్ని భారత ఎన్నికల సంఘం కల్పిస్తోంది. దీంతో అద్దె ఇళ్లు మారడం, మొబైల్ నెంబర్ మార్పు, వ్యక్తిగత ఫొటో మార్పు, ఊరు మార్పు తదితరాలు ప్రజలే సులభంగా ఆన్‌లైన్‌లో అప్డేట్ చేసుకోవచ్చని భారత ఎన్నికల సంఘం కమిషనర్ రాజీవ్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీని కోసం ఎన్నికల సంఘం అఫీషియల్ వెబ్ సైట్ https://voters.eci.gov.in లో వ్యక్తిగత విభాగంలో ఫారం 8ని ఎంచుకొని మార్పులు సవరించుకోవచ్చని ఎన్నికల సంఘం తెలిపింది.

టైప్ రైటింగ్ పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నాలజీ నిర్వహించే టైపింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చే నెలలో జరుగనున్న ఈ పరీక్షలకు అభ్యర్థులు www.tndtegteonline.in అనే వెబ్ సైట్‌లో ఈ నెల 31వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫిబ్రవరి 2 నుంచి 4వ తేది వరకు దరఖాస్తుల్లో సవరణలు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

టాన్సెట్, సీటాకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పీజీ కోర్సుల్లో చేరేందుకు 'టాన్సెట్' 'సీటా' ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంది. అర్హులైన వారు ఈ నెల 24వ తేది నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. 2025 విద్యా సంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏ పీజీ కోర్సుల్లో చేరేందుకు మార్చి 22వ తేది, ఎంఈ, ఎంటెక్, ఎంఆర్క్, ఎం ప్లాన్ తదితర పీజీ కోర్సుల్లో చేరేందుకు సీటా పరీక్ష మార్చి 23న నిర్వహించనున్నారు. అర్హులైన వారు ఈ నెల 24 నుంచి ఫిబ్రవరి 21వ తేది వరకు ఆన్‌లైన్‌లో www.tancet.annauniv.edu అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలి. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూరు చెట్టియార్ అగరం రోడ్డు సమీపంలోని సబ్ స్టేషన్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. పోరూర్, పరిసర ప్రాంతాల వినియోగదారులు సమస్యలకు పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

మదురై విమానాశ్రయం స్థాయి పెంపు

పెరంబూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మదురై విమానాశ్రయాన్ని గ్రేడ్-3 నుంచి గ్రేడ్-2కి అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మదురై, విజయవాడ, భోపాల్, అగర్తల, ఉదయపూర్, సూరత్ వంటి 6 విమానాశ్రయాలు లెవల్-2కి అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

రూ.5.8 కోట్లతో కార్పొరేషన్ పాఠశాలల్లో బెంచీలు

పెరంబూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత, మహోన్నత పాఠశాలలకు కొత్తగా రూ.5.8 కోట్లతో బెంచీలు అందించాలని నిర్ణయించింది. జీసీసీ పరిధిలో 32 మహోన్నత, 36 ఉన్నత, 1 ఉర్దూ ఉన్నత పాఠశాల, 1 తెలుగు ఉన్నత పాఠశాల, 92 మాధ్యమిక పాఠశాలలు (తమిళం, తెలుగు, ఉర్దూ), 122 ప్రాథమిక పాఠశాలలు, 30 మోడల్ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో విద్యార్థులు కూర్చొనేందుకు బెంచీలు అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

అన్నాడీఎంకేలో క్రీడాకారుల విభాగం

పెరంబూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే క్రీడాకారుల విభాగం ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటన విడుదల చేశారు. యువకులు, క్రీడాకారిణులను ప్రోత్సహించేలా అన్నాడీఎంకేలో క్రీడాకారులు, క్రీడాకారిణులు రెండు విభాగాలు ప్రారంభించనున్నారు. యువతీ యువకులను క్రీడల్లో ప్రోత్సహించేలా ఈ విభాగాలు పనిచేస్తాయని పళనిస్వామి తెలిపారు.

విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు నమోదు

పెరంబూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలను ఫిబ్రవరి 17వ తేదీలోగా యూడీఐఎస్ఈ వెబ్‌సైట్‌లో నమోదుచేయాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. కేంద్ర ప్రభుత్వ డైరెక్టరేట్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఎడ్యుకేషన్ 'యూడీఐఎస్ఈ' అనే వెబ్‌సైట్‌లో దేశంలోని పాఠశాలలు, విద్యార్థులు, ఉపాధ్యాయుల సమాచారాన్ని సేకరిస్తోంది. ఈ ప్రకారం 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు నమోదుచేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా ప్రధాన విద్యాధికారులకు పాఠశాల విద్యాశాఖ సర్క్యులర్ జారీచేసింది.

భారీ పోలీసు భద్రత మధ్య

విక్రవాండి స్కూలు పునఃప్రారంభం

చెన్నై, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా విక్రవాండిలోని సెయింట్ మేరీస్ మెట్రిక్యులేషన్ మహోన్నత పాఠశాల సోమవారం ఉదయం పునఃప్రారంభమైంది. ఆ పాఠశాలలో చదివే లియా లక్ష్మి (4) అనే బాలిక సెప్టిక్ ట్యాంక్‌లో పడి మరణించగా, బాలిక కుటుంబీకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ధర్నా, రాస్తారోకో జరిపారు. దీంతో పోలీసులు పాఠశాల కరస్పాండెంట్ ఎమిల్డా, ప్రిన్సిపాల్ డొమెనిక్ మేరీ, ఉపాధ్యాయురాలు ఏంజెల్ తదితరులను అరెస్టు చేశారు. ఆ తర్వాత హైకోర్టు ఉత్తర్వు మేరకు బెయిలుపై విడుదలయ్యారు. ఈ నేపథ్యంలో రెండు వారాలకు పైగా మూతపడిన ఆ పాఠశాలను సోమవారం నుండి తెరిచారు. ఆదివారమే విద్యార్థుల తల్లిదండ్రులకు ఎస్ఎంఎస్‌ల ద్వారా స్కూలు పునఃప్రారంభం గురించి తెలియజేయడం సోమవారం విద్యార్థులంతా వచ్చారు. ఆ పాఠశాల వద్ద గట్టి పోలీసు భద్రత కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటిముప్పు వాటిల్లకుండా స్కూలు ప్రాంగణమంతటా మరమ్మతులు చేపట్టామని, విద్యార్థులంతా సక్రమంగా తరగతులకు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.



ప్రైవేటు స్కూలు వద్ద పోలీసు బందోబస్తు

పోస్టులో గవర్నర్‌కు తిరువళ్లువర్ చిత్రం

పెరంబూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ ఆర్ఎన్ రవికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించిన తిరువళ్లువర్ విగ్రహాన్ని కాంగ్రెస్, ఎండీఎంకే, డీపీఐ పార్టీలకు చెందిన గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) కార్పొరేటర్లు పంపించారు. వ్యాసర్పాడి తపాలా కార్యాలయం నుంచి తిరువళ్లూర్ చిత్రాన్ని పోస్టు ద్వారా గవర్నర్‌కు పంపించారు. ఇకపై కేంద్ర ప్రభుత్వం అంగీకరించిన తిరువళ్లువర్ చిత్రం వినియోగించని పక్షంలో రాజ్‌భవన్ ముట్టడిస్తామని ఈ సందర్భంగా కార్పొరేటర్లు హెచ్చరించారు. ఇటీవల తిరువళ్లువర్ దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో కాషాయం రంగుతో తిరువళ్లువర్ విగ్రహం ఉండడంపై అధికార, ప్రతిపక్ష పార్టీలు ఖండించిన విషయం తెలిసిందే.

వలస కార్మికుల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

● పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్

ప్యారీస్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ఉపాధి కోసం వస్తున్న వలస కార్మికుల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రోత్సహించాల్సిందిగా జిల్లా విద్యాశాఖ అధికారులకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న ఉత్తరాది కార్మికుల పిల్లలకు తమిళంలో పట్టు సాధించేందుకు అవసరమైన చర్యలను పాఠశాల విద్యాశాఖ చేపట్టింది. అధిక మార్కులు సాధించే విద్యార్థులను ప్రోత్సహిస్తూ నగదు, ఇతర బహుమతులు, రాయితీలు కూడా అందజేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. వలస కార్మికులున్న ప్రాంతాలకు వెళ్లి బడి ఈడు పిల్లలను ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయులకు కూడా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

హత్యకేసులో 8 మందికి యావజ్జీవ శిక్ష

పెరంబూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): యువకుడి హత్య కేసులో నిందితులకు యావజ్జీవశిక్ష విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు తీర్పు వెలువరించింది. తిరునల్వేలి జిల్లా వీరవనల్లూర్‌లో 2014లో సురేష్ అనే యువకుడు హత్యకు గురయ్యాడు. దీర్ఘకాలం సాగిన ఈ కేసు విచారణ జరగగా సోమవారం న్యాయమూర్తి పద్మనాభన్ తీర్పువెలువరించారు. ఈ ప్రకారం, ఈ కేసులో నిందితులుగా ఉన్న సెంథిల్‌కుమార్, మురగేశన్, చంద్రన్, పిచ్చుమణి, నంబిరాజన్, మదియళగన్, శ్రీకాంత్, మలైయప్పన్ తదితరులకు యావజ్జీవ శిక్ష విధించారు.

యూట్యూబర్ బైకు ఢీకొని కార్మికుడి మృతి

టి.నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా భవానీ సమీపంలో యూట్యూబర్ సంతోష్ నడుపుతున్న బైకు ఢీకొని సతీష్‌కుమార్ (42) అనే కార్మికుడు మృతి చెందారు. సంతోష్ (20) శాండీ వ్యూస్ పేరుతో యూట్యూబ్ చానల్ నడుపుతూ నడిపి లక్షకు పైగా వ్యూస్ సాధించాడు. తరచూ తన లగ్జరీ బైకుతో సాహస విన్యాసాలు చేస్తూ వాటిని రీల్స్ తీసి పోస్టు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం స్నేహితులతో కలిసి బైకులో గోవాకు విహారయాత్రగా వెళ్లాడు. గోవా పర్యటనను ముగించుకుని బైకులో తిరిగి వస్తుండగా ఆదివారం రాత్రి భవానీ వద్ద ఎదురుగా బైకులో వచ్చిన సతీష్‌కుమార్ అనే కార్మికుడిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సతీష్‌కుమార్ ఘటనా స్థలంలోనే మరణించాడు. యూట్యూబర్ సంతోష్‌కుమార్, అతడి స్నేహితుడు కవిన్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ సమాచారం తెలుసుకుని పోలీసులు హుటాహుటిన అక్కడికి వెళ్ళి గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.



యూట్యూబర్ సంతోష్‌కుమార్

మామను చంపిన అల్లుడి అరెస్ట్

ప్యారీస్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా ఆరోగ్యపురంలో కుటుంబ కలహాల కారణంగా మామను సొంత అల్లుడే హతమార్చినట్లు పోలీసులు తెలిపారు. వివరాలిలా... ఆరోగ్యపురంలో నివాసముంటున్న భాస్కర్ (51), సెల్వరాణి (48) దంపతుల కుమార్తె లక్ష్మికి అదే ప్రాంతానికి చెందిన బంధువు మరియాకుమార్‌తో రెండేళ్ల కిందట వివాహం జరిగింది. ఇటీవల వారి మధ్య తరచూ గొడవలు జరగడంతో శనివారం సాయంత్రం భాస్కర్, సెల్వరాణి వారికి సర్దిచెపేందుకు కూతురి ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో వాగ్వాదం జరగడంతో అల్లుడు కొడవలితో తన మామపై దాడి చేసి పారిపోయాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన భాస్కర్ అక్కడే మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి 24 గంటల్లోనే నిందితుడిని అరెస్ట్ చేశారు.

వృద్ధుడిని పశువులపాకలో వదిలేసిన కోడలు

ప్యారీస్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వృద్ధుడైన మామను పశువుల పాకలో వదిలేసిన కోడలి దుశ్చర్య మదురై జిల్లా ఆళ్వార్‌పురంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... మదురైజిల్లా జైహింద్‌పురానికి చెందిన వెంకటాచలం (90) అనారోగ్యం కారణంగా తన కుమారుడైన రవీంద్రన్ ఇంటిలో ఉండగా, కోడలు రోజు అతడిని ఇబ్బందులకు గురిచేస్తుండేది. ఈ క్రమంలో వెంకటాచలం ఆరోగ్యం మరింత క్షీణించడంతో కోడలు స్రవంతి శుక్రవారం సాయంత్రం ఆస్పత్రికి తీసుకెళ్తానని చెప్పి, ఆళ్వార్‌పురంలో వున్న పశువులపాకలో వదిలేసి వెళ్లిపోయింది. శనివారం రాత్రి కురిసిన భారీవర్షానికి తడుస్తూ, చలికి వణుకుతున్న వృద్ధుడిని చూసిన సమీపంలోని హాస్టల్ విద్యార్థినులు వీడియో తీసి జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసున్న కలెక్టర్ సంగీత వెంటనే ఆ వృద్ధుడిని రక్షించి, చికిత్స అందించాలని రెడ్‌క్రాస్ సొసైటీని ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి రాజ్‌కుమార్ ఆ వృద్ధుడినిఅంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. వృద్ధుడి కోడలు స్రవంతిపై పోలీసులు కేసు నమోదు చేశారు.



వృద్ధుడిని ఆస్పత్రికి తరలిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

డిపోలో అగ్నిప్రమాదం

● 2 బస్సుల దగ్ధం

చెన్నై, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి సమీపం తచ్చానల్లూరు వద్దనున్న ప్రైవేటు బస్‌డిపోలో సోమవారం వేకువజాము సంభవించిన అగ్నిప్రమాదంలో రెండు బస్సులు దగ్ధమయ్యాయి. ఆ బస్ డిపోలో 50కి పైగా ప్రైవేటు బస్సులను పార్కింగ్ చేసి, వాటికి మరమ్మతులు చేస్తుంటారు. ఆదివారం రాత్రి ఆ బస్ డిపోలో 20 బస్సులను పార్కింగ్ చేశారు. వాటిలో ఓ బస్సును మెకానిక్‌లు మరమ్మతు చేస్తుండగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో గాలి బలంగా వీయడంతో పక్కనే ఉన్న మరొక బస్సుకు నిప్పంటుకుంది. దీంతో మెకానిక్‌లు పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి ఫిర్యాదు చేశారు. అగ్నిమాపక దళం ఫైరింజన్‌తో వెళ్ళి మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఆ రెండు బస్సులు మంటల్లో ఆహుతయ్యాయి.. తచ్చానల్లూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక దళం సభ్యులు

రామేశ్వరంలో కుండపోత

● ఆలయం మండపంలోకి ప్రవేశించిన వర్షపునీరు

టి.నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా రామేశ్వరంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ కురిసిన కుండపోత వర్షానికి జనజీవనం స్తంభించింది. రామనాథస్వామివారి ఆలయంలోని అమ్మవారి సన్నిధికి ఎదురుగా ఉన్న ముఖమండపంలోని వర్షపు నీరు ప్రవేశించింది. పారిశుధ్య కార్మికులు వాననీటిని తొలగించారు. రామేశ్వరం - ధనుష్కోడి ప్రధాన రహదారి, రథం వీధి, కొత్త బస్టాండు ప్రాంతం తదితర ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. సోమవారం వేకువజాము వరకూ చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. దీనితో రహదారులలో వర్షపునీరు ప్రవహించడంతో వాహనాలు నత్తనడక నడిచాయి.



రామేశ్వరం ఆలయంలో వర్షపునీటిని తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

రేపు మదురైలో డ్రోన్లపై నిషేధం

పెరంబూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సీఎం స్టాలిన్ జిల్లా పర్యటన సందర్భంగా బుధవారం డ్రోన్లపై నిషేధం విధించినట్లు మదురై జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు అతిక్రమించి డ్రోన్లు ఎగురవేసే వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని కలెక్టర్ హెచ్చరించారు.

వెబ్‌సైట్‌లో 'ఓఎంఆర్' కొత్త నమూనా

పెరంబూర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి):'ఓఎంఆర్ జవాబు పత్రంలో కొత్త మార్పులు చేస్తున్నట్లు టీఎన్‌పీఎస్సీ ప్రకటించింది. కొత్త ఓఎంఆర్ జవాబు పత్రం నమూనాలను www.tnpsc.gov.in అనే వెబ్‌సైట్ నుంచి తెలుసుకోవచ్చు. టీఎన్‌పీఎస్సీ నిర్వహించే పరీక్షలకు హాజరుకానున్న అభ్యర్థులు, ఈ కొత్త ఓఎంఆర్‌లో చేపట్టిన మార్పులు తెలుసుకోవాలని సూచించింది.

నెమళ్లను చంపిన వ్యక్తి అరెస్ట్

వేలూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సదుప్పేరిలో నెమళ్లను చంపిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్‌చేశారు. సదుప్పేరి పాళ్యం గ్రామానికి చెందిన రైతు పాండ్యన్ తన పొలాల్లోకి వస్తున్న పక్షులు, నెమళ్లు పంటను నాశనం చేస్తుండడంతో, వాటిని చంపేందుకు ఎలుకల మందు కలిపిన ఆహారం ఉంచాడు. ఈ ఆహారం తిన్న 6 నెమళ్లు మృతి చెందాయి. దీనిపై కేసు నమోదుచేసిన అటవీ శాఖ అధికారులు పాండ్యన్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

దిండుగల్ పాఠశాలకు బాంబు బెదిరింపు

పెరంబూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): దిండుగల్‌లోని సెయింట్ వల్లనార్ మెట్రిక్యులేషన్ పాఠశాలకు సోమవారం ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. పాఠశాల నిర్వాహకుల ఫిర్యాదుతో పోలీసులు డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌తో పాఠశాల వద్దకు చేరుకొని పరిశీలించి, బాంబు బెదిరింపు నకిలీదిగా గుర్తించి, ఈ-మెయిల్ పంపిన చిరునామా కోసం విచారిస్తున్నారు.

మేఘమలై జలపాతం వద్దకు సందర్శకుల నిషేధం

పెరంబూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా ఆండిపట్టి మేఘమలై జలపాతం దగ్గరకు సందర్శకులు వెళ్లేందుకు నిషేధం విధించినట్లు అటవీ శాఖ ప్రకటించింది. తేని నుంచి 54 కి.మీ దూరంలోని ఈ జలపాతం వద్దకు ప్రతిరోజు పర్యాటకులు వస్తుంటారు. పశ్చిమ కనుమల్లో కురుస్తున్న భారీవర్షాల కారణంగా ఈ జలపాతంలోనీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో, ప్రజల భద్రత దృష్ట్యా జలపాతం వద్ద స్నానాలకు నిషేధం విధించినట్లు అటవీ శాఖ తెలిపింది.

ఎంటీసీ డ్రైవరుకు గుండెపోటు

● ప్రయాణికులకు తప్పిన ముప్పు

అడయార్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎంటీసీ బస్సు డ్రైవరుకు డ్యూటీలో ఉండగా, ఆకస్మికంగా గుండెనొప్పి వచ్చింది. దీంతో చాకచక్యంగా బస్సును వంతెనకు ఢీకొట్టించి ఆపేయడంతో ఆ బస్సులోని ప్రయాణికులు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఎంటీసీ రూట్ నెంబరు 102 సిటీ బస్సులో డ్రైవర్ అళగప్పన్ (49) సోమవారం డ్యూటీలో ఉన్నాడు. ఈ బస్సు అడయారు వంతెన ఎల్బీ సాలైలో వెళుతుండగా, డ్రైవరుకు గుండెనొప్పి రావడంతో నియంత్రణ కోల్పోయాడు. దీంతో బస్సును వంతెనకు ఢీకొట్టించాడు. దీంతో బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా బటయపడ్డారు. సమాచారం తెలుసుకున్న అడయార్ ట్రాఫిక్ పోలీసులు హుటాహుటిన వెళ్లి డ్రైవరును 108 అంబులెన్స్‌లో రాయపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

రూ.160 కోట్లతో 776 ఇళ్ల నిర్మాణాలు

పెరంబూర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక మింట్ ప్రాంతంలో రూ.160 కోట్లతో 776 ఇళ్ల సముదాయ నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. మింట్ ఆంగ్లేయుల కాలంలో ప్రజాపనుల శాఖ గోదాములో డ్యాం నిర్మాణాలకు అవసరమైన ఉపకరణాలు తయారువుతుండేవి. 150 ఏళ్ల గడిచి భవనాలు శిధిలావస్థకు చేరుకోవడంతో, వాటిని కూల్చివేసి, అర్హులైన పేదలకు ఇళ్లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉత్తర చెన్నై అభివృద్ధి పథకంలో సీఎండీఏ ఈ పనులు చేపట్టింది. పడకగది, వంటగది, టాయిలెట్, హాలుతో కూడిన ఇళ్ల నిర్మాణాలను 18నెలల్లో పూర్తిచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

రిపబ్లిక్‌డే రిహార్సల్స్

● కామరాజర్‌సాలైలో ట్రాఫిక్ మార్పులు

ఐసిఎఫ్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మెరీనాబీచ్ కామరాజర్‌సాలైలో రిపబ్లిక్‌డే వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 22, 24 తేదీలు, ఈ నెల 26 రిపబ్లిక్ డే రోజున వాహనాల రాకపోకల్లో మార్పులు చేపడుతున్నట్లు ట్రాఫిక్ పోలీసు అధికారులు తెలిపారు. వివరాలిలా వున్నాయి...

- కామరాజర్ రోడ్డులో గాంధీ విగ్రహం నుంచి యుద్ధవీరుల సంస్మరణ స్థూపం వరకు ఉదయం 6 గంటల నుండి 20, 22, 24తేదీల్లో రిహార్సల్స్ ముగిసేంతవరకు వాహనాల రాకపోకలు పూర్తిగా రద్దు చేస్తారు.
- అడయార్ ప్రాంతం నుండి కామరాజర్‌రోడ్డులో బ్రాడ్వేకు వెళ్లే సరకుల, వాణిజ్య వాహనాలు గ్రీన్‌వే జంక్షన్ నుంచి ఆర్కే మఠ్ రోడ్డు, తిరువేంగడం రోడ్డు, దేవనాథన్ రోడ్డు, సెయింట్ మేరీస్ రోడ్డు, రామకృష్ణమఠం రోడ్డు, వెంకటేశ అగ్రహారం వీధి, రంగా రోడ్డు, ఈస్ట్‌అభిరామపురం నుంచి థెరులెస్ అవెన్యూ అమృతాంజన్ జంక్షన్, బీఎస్ శివసామి రోడ్డు, రాధాకృష్ణన్ రోడ్డు, మ్యూజిక్ అకాడమీ రోడ్డు, టీటీకే రోడ్డు, గౌడియామఠ్ రోడ్డు, రాయపేట ఆసుపత్రి, టవర్‌క్లాక్, జనరల్ పేటర్స్ రోడ్డు, అన్నాసాలై మీదుగా బ్రాడ్వే బస్టాండుకు వెళ్ళాల్సి ఉంటుంది.
- అడయార్ ప్రాంతం నుండి కామరాజర్ రోడ్డు మీదుగా బ్రాడ్వే వైపు వెళ్లే ఇతర వాహనాలు, (సిటీ బస్సులు సహా) గాంధీ విగ్రహ కూడలిలో రాధాకృష్ణన్ రోడ్డు వైపు తిరిగి, రాయపేట నీలగిరీస్, జనరల్ పేటర్స్ రోడ్డు, అన్నాసాలై మీదుగా బ్రాడ్వే బస్టాండుకు వెళ్ళాల్సి ఉంటుంది.
- మైలాపూరు ప్రాంతం నుంచి వచ్చే అన్ని వాహనాలు రాయపేట హైరోడ్డుకు వచ్చి రాయపేట ఫస్ట్ పాయింట్‌లో, ఇతర వాహనాలు ఎడమవైపు లేదా కుడివైపు తిరిగి తమ గమ్యస్థానాలను చేరుకోవాల్సి ఉంటుంది. సిటీబస్సులు ఎడమవైపు తిరిగి రాధాకృష్ణన్ రోడ్డు, నీలగిరీస్, మ్యూజిక్ అకడామీ, టీటీకే రోడ్డు, గౌడియమఠం రోడ్డు, రాయపేట హైరోడ్డు, రాయపేట టవర్ క్లాక్ రహదారి మీదుగా బ్రాడ్వే వెళ్లాలి.
- డాక్టర్ నటేశన్ రోడ్డు, అవ్వై షణ్ముగం రోడ్డుజక్షన్ మీదుగా కామరాజర్ రోడ్డు వైపు వచ్చే వాహనాలను ఐస్‌హౌస్ జంక్షన్ వైపు మళ్ళించనున్నారు.
- డాక్టర్ బిసెంట్‌రోడ్డు నుండి కామరాజర్ రోడ్డు వైపు వచ్చే వాహనాలను బిసెంట్ రోడ్డు రౌండ్‌థానా నుండి ఐస్‌హౌస్ జంక్షన్ వైపు మళ్ళిస్తారు.
- కామరాజర్ రోడ్డు వైపు వచ్చే వాహనాలు భారతిరోడ్డు, బెల్స్‌రోడ్డు జంక్షన్‌లో బెల్స్ రోడ్డు వైపు మళ్ళిస్తారు.
- వాలాజా రోడ్డు, బెల్స్‌రోడ్డు జంక్షన్ శ్రామికుల విగ్రహం వైపు వచ్చే వాహనాలు బెల్స్ రోడ్డు మీదుగా మళ్లిస్తారు.
- అన్నా సమాధి సమీపంలో ఉన్న బస్టాపును తాత్కాలికంగా చింతాద్రిపేట రైల్వేస్టేషన్‌కు మార్చనున్నారు
- ప్యారీస్ కార్నర్ నుంచి రాజాజీ రోడ్డు, కామరాజర్‌రోడ్డు మీదుగా అడయార్ వైపు వెళ్లే అన్ని వాహనాలు రిజర్వు బ్యాంక్ సబ్‌వేలో కాకుండా నార్త్ హార్బర్ రోడ్డు మీదుగా రాజా అన్నామలై మండ్రం, వాలాజా పాయింట్, అన్నాసాలై, అన్నా విగ్రహం కూడలి, జీపీ రోడ్డు, రాయపేట టవర్ క్లాక్, వెస్ట్‌కాట్ రోడ్డు, జీఆర్‌హెచ్, అజంతా జంక్షన్ ఎడమవైపు మళ్లించి లాయిడ్స్ రోడ్డు (వీపీ రామన్ రోడ్డు), జస్టిస్ జంబులింగం వీధి ఎడమవైపు లేదా కుడివైపు మళ్ళించి డాక్టర్ రాధాకృష్ణన్ రోడ్డు మీదుగా గమ్యస్థానాలకు చేరుకోవాల్సి ఉంటుంది.
- అన్నాసాలై, వాలాజా పాయింట్ జంక్షన్, యుద్ధవీరుల స్మారక స్థూప స్థలం వైపు వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధిస్తారు. వాహన చోదకులు ఈ ట్రాఫిక్ మార్పులను గుర్తుంచుకుని వాహనాలను నడపాలని, రిపబ్లిక్ డే రోజున 26వ తేదీ కూడా ఇదే మార్పులుంటాయని ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. ఆయా ప్రాంతాల వివరాలిలా...

తండయార్‌పేటలో ...

కుమ్మాలమ్మన్ కోవెల్ వీధి, జీఏ రోడ్డు, టీఎస్ రోడ్డులోని ఒక భాగం, సోలయప్పన్ వీధి, కప్పల్‌బోలు వీధి, వీపీ కోవెల్ వీధి, తాండవరాయన్ వీధి, రామానుజం వీధి, రైనీ ఆస్పత్రి, శ్రీరంగమ్మాల్ వీధి, సంజీవరాయన్ వీధి, సుబ్రహ్మణ్యన్ వీధి, బాలుముదలి వీధి, ఓల్డ్ వాషర్‌మెన్‌పేట, మన్నప్పన్‌వీధిలోని ఒక భాగం, తంగవేలు వీధి, నన్నియప్పన్ వీధి, పెరుమాళ్ కోవిల్ వీధి, వీరాకుట్టి వీధి, కేజీ గార్డెన్, మేయర్‌బాసువీధి.

పల్లిక్కరనైలో...

అస్సాం భవన్, ఒడిస్సా భవన్, ఎస్ఎల్ఎల్ఎస్‌టీ సేవా, కామాక్షి ఆస్పత్రి, మైలై బాలాజీనగర్ 1 నుంచి 4వ నగర్, తందైపెరుయార్ నగర్, శ్రీనివాసనగర్, సిలికాన్ టవర్, జాస్మిన్ ఇంఫోటెక్, సీటీఎస్, ఎన్‌జీడబ్ల్యూఈఎస్‌టీ, కార్పొరేషన్ డంపింగ్ యార్డ్, వేలచ్చేరి హౌసింగ్ బోర్డు మెయిన్ రోడ్డు, ఆర్వీ గోపురంగల్.

కేకే నగర్‌లో...

కన్నికాపురం, 1,2,3 వీధులు విజయరాఘవపురంలోని 1,2,3,4,5 వీధులు, క్రాస్‌వీధి, రాజా మన్నర్ రోడ్డులోని మీరన్ సాహెబ్ వీధి, ఏవీఎం స్టూడియో, ఏవీఎం హస్పా, ఆర్కాడ్ రోడ్డులోని కేబెల్ల ప్రాంతం, కుమరన్ కాలనీ మెయిన్ రోడ్డు, సాలిగ్రామం, 80 అడుగుల రోడ్డులోని ఒక భాగం, రాణి అన్నై నగర్, బీటీరాజన్ రోడ్డు, కేకే నగర్ 94వ వీధి నుండి 104వ వీధి వరకు, ఎస్ఎస్‌బీ నగర్, ఎస్వీ లింగం రోడ్డు, విజయ వీధి వంటి ప్రాంతాల్లో రేపు విద్యుత్ ఉండదని అధికారులు ఓ ప్రకటనలో విడుదల చేశారు.

భర్తను హతమార్చేందుకు పన్నాగం..

● భార్య సహా ముగ్గురి అరెస్ట్

ప్యారీస్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): భర్తను హతమార్చేందుకు ప్రయత్నించిన భార్యతో పాటు మరో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రామనాథపురం జిల్లా అలంగన్‌కుళంలో తాపీమేస్త్రీగా పనిచేస్తున్న లక్ష్మణన్ (45) భార్య ఈశ్వరి(42) అక్కడి రొయ్యల ఫ్యాక్టరీలో స్వీపర్‌గా పనిచేస్తోంది.. వీరికి ఇద్దరు కుమార్తెలు. ఈ క్రమంలో ఈశ్వరికి రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన శశికుమార్ (31)తో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. దీంతో రెండేళ్లకు పైగా శశికుమార్ అవసరాలకు ఈశ్వరి తన ఇంట్లోని నగలు, డబ్బు ఇస్తుండేది. తరుచూగా ఇంట్లోని నగలు, డబ్బు మాయమవుతుండే సరికి అనుమానం వచ్చిన లక్ష్మణన్ భార్యను వెంబడించి, అసలు విషయాన్ని తెలుకున్నాడు. దీనిపై ప్రశ్నించడంతో భార్యాభర్తల మధ్యల గొడవలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఈశ్వరి ప్రియుడుతో కలిసి తొండి ప్రాంతానికి చెందిన రౌడీలు ప్రదీప్ (30), గౌతమ్ (34)లకు డబ్బులిచ్చి భర్తను హతమార్చేందుకు పథకం వేసింది. దీనిని పసిగట్టిన లక్ష్మణన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు హత్యాయత్నానికి ప్రయత్నించిన ఈశ్వరి సహా ముగ్గురిని అరెస్టు చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్ తరలించారు. పరారీలో ఉన్న ప్రదీప్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

స్నేహితుడి హత్యకు ప్రతీకారం

● మారణాయుధాలతో నలుగురి అరెస్టు

అడయార్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తమ స్నేహితుడిని హత్య చేసినవారిని కూడా హతమార్చాలని కుట్రపన్నిన నలుగురు రౌడీలను మారణాయుధాలతో నగర పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు సమయంలో పోలీసులకు చిక్కకుండా పారిపోయేందుకు ప్రయత్నించిన రౌడీలు అదుపుతప్పి కిందపడటంతో కాళ్లు చేతులు విరిగాయి. పోలీసులు వెల్లడించిన వివరాలమేరకు.. కాశిమేడు దిడీర్‌నగర్‌కు చెందిన ఉలగనాథన్ రౌడీగా చెలామణి అయ్యేవాడు. ఈయన భార్య మాలతి గంజాయి వ్యాపారం చేసేది. వీరిద్దరూ బుధవారం రాత్రి ఇంటిలో ఉండగా అదే ప్రాంతానికి చెందిన వల్లరసు అనే రౌడీ తన అనుచరులతో వచ్చి దాడిచేసి హత్యచేశాడు. ఈ హత్యలపై కాశీమేడు హార్బర్ పోలీసులు కేసు నమోదు చేసి వల్లరసు, ఆంటోనీ, ఎబినేసర్, ఎళిలరసన్, మనోజ్, గుణశేఖరన్‌లను అరెస్టుచేశారు. ఈనేపథ్యంలో హత్యకు ప్రతీకారం తీర్చుకునేందుకు ఉలగనాథన్ స్నేహితులు గోపి, వెంకటేశన్, ఆకాష్, చెల్లదురై, కిషోర్ మారణాయుధాలతో దిడీర్‌నగర్ పార్కులో దాగారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు.. వీరిని అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా, గోపి, వెంకటేశన్, కిషోర్ పార్కు ప్రహరీగోడ దూకి పారిపోయేందుకు ప్రయత్నించి, కిందపడడంతో కాళ్లు చేతులు విరిగాయి. వీరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు పిండికట్టు కట్టించి, అరెస్టు చేశారు.

పంట కోల్పోయిన రైతులకు నష్టపరిహారమివ్వాలి

ప్యారీస్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు డెల్టా జిల్లాలో వరి పంట కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.35వేలు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో, కావేరి డెల్టా జిల్లాల్లో పంట చేతికి వచ్చే సమయంలో కురిసిన భారీ వర్షాలకు పంట నీటమునిగి నష్టపోయిన రైతులకు నష్టపరిహారంతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో 17 శాతం తేమవున్న వరిని, 25శాతంగా పెంచాలని ఆయన కోరారు.

ఆంధ్రాకు తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం

తిరుత్తణి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రాకు అక్రమంగా తరలిస్తున్న రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని ప్రత్యేక విభాగం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తిరువళ్లూర్ జిల్లా ఆర్కే పేట తాలూకాలోని ఇరుళర్ ప్రాంతంలోని పీహెచ్‌సీ సమీపంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు వాహనతనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటువైపు వచ్చిన వాహనాన్ని ఆపేందుకు యత్నించగా, అందులో ఉన్న వారు కారును వేగంగా నడిపి కొద్ది దూరంలో ఆపి పరారయ్యారు. పోలీసులు వాహనాన్ని తనిఖీ చేసి అందులో ఉన్న 2 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని, పరారైన వారి కోసం గాలిస్తున్నారు.

బస్ పాస్‌కు గడువు పొడిగింపు

పెరంబూర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎంటీసీ బస్సుల్లో పాస్ పొందేందుకు ఈనెల 24వతేది వరకు అవకాశం కల్పించారు. ఎంటీసీ బస్ పాస్‌లు ప్రతినెలా 16వ తేది వరకు ఇస్తుంటారు. ప్రస్తుతం సంక్రాంతి సెలవుల కారణంగా పలువురు స్వగ్రామాలకు వెళ్లడంతో పాస్ పొందలేకపోయారు. దీంతో రూ.1,000 నెలవారీ పాస్, విద్యార్థులకు 50శాతం రాయితీపాస్ సహా అన్ని రకాల పాస్‌లు ఈ నెల 24వ తేది వరకు తీసుకోవచ్చని ఎంటీసీ ప్రకటించింది.

అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు స్వాధీనం

వేలూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వాహనాలకు అధిక శబ్దం వచ్చేలా ఏర్పాటుచేసిన 45 సైలెన్సర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలో యువకులు, అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లున్న బైక్‌లపై వెళ్తుండడంతో ప్రయాణికులు భీతి చెందుతున్నారు. ఈ విషయమై జిల్లా ఎస్పీ మదివానన్ ఉత్తర్వులతో ట్రాఫిక్ పోలీసులు పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి 45 ద్విచక్రవాహనాలకు అమర్చిన సైలెన్సర్లు స్వాధీనం చేసుకొని జరిమానా విధించారు.

మాజీ ఉపాధ్యాయుల సమావేశం

వేలూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలల మాజీ ఉపాధ్యాయుల సమావేశం సోమవారం చెల్లియప్ప భవనంలో రాష్ట్ర కార్యకర్తల సభ్యుడు జనార్దనన్ అధ్యక్షతన జరిగింది. జిల్లా జాయింట్ ఆర్గనైజర్లు గోపాల రాజేంద్రన్, మనోహరన్, జిల్లా అధ్యక్షుడు దామోదరన్ తదితరులు పాల్గొన్నారు. తమ డిమాండ్లతో కూడిన పుస్తకాన్ని అతిథులు, నిర్వాహకులు ఆవిష్కరించారు.

గ్రీవెన్స్‌లో 264 వినతులు

వేలూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ జరిగింది. కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రజల నుంచి 264 వినతిపత్రాలు స్వీకరించి, వెంటనే విచారించి తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, తదితర అధికారులు పాల్గొన్నారు.

వైభవ్ - నిహారిక జంటగా 'పెరుసు'


'పెరుసు'లో ఓ దృశ్యం

ఇళంగో రామ్ దర్శకత్వంలో వైభవ్, నిహారిక జంటగా నటించిన చిత్రానికి 'పెరుసు' (తెలుగులో 'పెద్ద) అనే టైటిల్ ఖరారు చేసి, ఈ మూవీ ఫస్ట్‌లుక్‌ను తాజాగా రిలీజ్ చేశారు. స్టోన్‌బెంచ్ బ్యానరుపై రూపొందుతున్న ఈ సినిమాలోని ఇతర పాత్రల్లో సునీల్, కరుణాకరన్ సహా అనేక మంది నటీనటులు నటిస్తున్నారు. ఫ్యామిలీ, ఫన్, డ్రామా జోనర్‌లో రూపొందుతున్న ఈ మూవీని వేసవిలో విడుదల చేసేలా ప్లాన్ చేశారు. స్టోన్‌బెంచ్ సీఈవో ఎస్.కార్తికేయ తాజాగా ఈ వివరాలను వెల్లడించారు. 'పెరుసు' మూవీ కోసం దర్శకుడు ఇళంగో కార్తీక్‌తో కలిసి పని చేయడం సంతోషంగా ఉంది. సరికొత్త కథాంశంతో రూపొందిస్తున్నారు. ఈ స్క్రిప్టు ఖచ్చితంగా ప్రేక్షకులను ఆశ్చర్యపరచడంతో పాటు ఎంటర్‌టైన్ చేస్తుంది. స్టోన్‌బెంచ్ నిర్మాణ సంస్థ సృజనాత్మక కథనానికి పెద్దపీట వేస్తూ, ప్రతిభావంతులైన టెక్నీషియన్లను ప్రోత్సహిస్తోంది. ఈ కోవలోనే దర్శకుడు ఇళంగో రామ్‌తో కలిసి ఈ ప్రాజెక్టును తమిళం, తెలుగు ప్రేక్షకులను అలరించేలా తెరకెక్కిస్తున్నాం' అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా సత్య తిలకం, సంగీతం అరుణ్ రాజ్, నిర్మాతలు కార్తికేయన్ ఎస్, హర్మన్ బవేజా, హిరణ్య పెరీరా.

తమిళ చిత్రజ్యోతి

'బాటల్ రాధ' మంచి చిత్రంగా నిలిచిపోతుంది

● అమీర్



మద్యానికి బానిసలై రోగులుగా మారినవారి సాదకబాధలతో తీసిన 'బాటల్ రాధ' సినిమా కోలీవుడ్‌లో మంచి చిత్రంగా నిలుస్తుందని ప్రముఖ దర్శకుడు అమీర్ అన్నారు. ప్రముఖ దర్శకుడు పా.రంజిత్‌కు చెందిన నీలం ప్రొడక్షన్, నిర్మాత అరుణ్ బాలాజీకి చెందిన బలూన్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'బాటల్ రాధ'. డెబ్యూ డైరెక్టర్ దినకరన్ శివలింగం దర్శకత్వం వహించగా, షాన్ రోల్డన్ సంగీత స్వరాలు సమకూర్చారు.గురుసోమసుందరం, సంజనా, జాన్‌విజయ్, మారన్ తదితరులు నటించారు. ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ నగరంలో జరిగింది. ఇందులో ప్రముఖ దర్శకులు వెట్రిమారన్, లింగుస్వామి, అమీర్, మిష్కిన్ ప్రత్యేక అతిథులుగా హాజరై ట్రైలర్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా అమీర్ మాట్లాడుతూ, 'మద్యానికి బానిసైన వారి గురించి ఒక చిత్రాన్ని తీయాలని గత కొంతకాలంగా పరిశోధన చేస్తున్నాను. కానీ, ఈ సినిమా చూశాక తాగుబోతులు, వారి అనారోగ్య సమస్యలపై మరో సినిమా తీయకూడదని నిర్ణయించుకున్నాను. మద్యానికి బానిసలై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి కోసం ఇంతకంటే మరొకరు అద్భుతంగా తీయలేరు. ఇది తమిళంలో ది బెస్ట్ మూవీగా నిలుస్తుంది' అని అన్నారు. దర్శకుడు లింగుస్వామి మాట్లాడుతూ, 'ఈ కాలానికి అవసరమైన చిత్రం. తమిళంలో అత్యుత్తమంగా నిలుస్తుంది' అని అన్నారు. దర్శకుడ వెట్రిమారన్ మాట్లాడుతూ, 'స్క్రిప్టుతో పాటు స్క్రీన్‌ప్లే కూడా చాలాబాగుంది. మద్యానికి బానిసలైన వారితో పాటు వారి కుటుంబ సభ్యులు, నేటి యువత చూడాల్సిన సినిమా' అని అన్నారు. దర్శక నిర్మాత పా.రంజిత్ మాట్లాడుతూ, 'మద్యపానం అనేక కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తుంది. ఈ స్టోరీని దినకర్ వినిపించగా అందులోని నిజాలు తెలుసుకునిఆశ్చర్యపోయాను.కోలీవుడ్‌కు ఇలాంటి సినిమాలు అందించాలన్న లక్ష్యంతో నిర్మించాం' అని పేర్కొన్నారు.

ఆ పెదవులే అభిమానులను ఆకర్షించాయి : భూమిక



ఒకపుడు ప్రతి ఒక్కరూ హేళన చేసిన తన పెదవులే తనకు గుర్తింపు తెచ్చిపెట్టి, ఎంతో మంది అభిమానులను ఆకర్షించాయని సీనియర్ నటి భూమిక అన్నారు. అగ్రహీరో విజయ్‌తో కలిసి 'బద్రి' మూవీ ద్వారా తమిళ వెండితెరకు పరిచయమైన భూమిక.. ఆ తర్వాత 'రోజాకూట్టం', 'జిల్లును ఒరు కాదల్' వంటి పలు చిత్రాల్లో నటించారు. తమిళంలోనే కాకుండా, తెలుగు, మలయాళం, కన్నడం, హిందీ భాషల్లో అనేక చిత్రాల్లో నటించారు. ఇటీవల జయం రవి నటించిన 'బ్రదర్' మూవీలో అక్క పాత్రలో నటించి మెప్పించారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, 'నేను చదువుకునే రోజుల నుంచే నా పెదవులను చూసి ప్రతి ఒక్కరూ హేళన చేసేవారు. ఆ మాటలు ఎంతో బాధకు గురిచేశాయి. నేను సినిమా పరిశ్రమలో అడుగుపెట్టిన తర్వాత ఆ పెదవులే అభిమానులను ఎంతగానో ఆకర్షించాయి. నా పెదవులను వర్ణిస్తూ అనేక మంది ఫ్యాన్స్ లేఖలు రాశారు. ఇండస్ట్రీలో నాకంటూ ఓ గుర్తింపుగా మారిపోయాయి' అని భూమిక చెప్పుకొచ్చారు.

దర్శకురాలిగా దేవయానికి అవార్డు

గత మూడు దశాబ్దాలుగా చిత్రపరిశ్రమలో కొనసాగుతున్న నటీమణి దేవయాని తొలిసారి దర్శకత్వం వహించిన ఒక షార్ట్ ఫిల్మ్‌కు అవార్డు వరించింది. ఈ అవార్డును ఆమె స్వీకరించారు. సుమారు వందకుపైగా చిత్రాల్లో నటించిన ఆమె... తొలిసారి 'కైకుట్టి రాణి' అనే లఘు చిత్రాన్ని నిర్మించి, దర్శకత్వం వహించారు. నిహారిక వీకే, నవీన్ ప్రధాన పాత్రలు పోషించారు. ఇళయరాజా సంగీత స్వరాలు సమకూర్చగా, పి.లెనిన్ ఛాయాగ్రహణం అందించారు. సుమారు 20 నిమిషాల నిడివి కలిగిన ఈ లఘు చిత్రం చిన్నారుల ఎమోషన్స్ చూపిస్తుంది. తల్లిని కోల్పోయి, తండ్రి మరో ఊరిలో నివసించే ఓ బాలిక తన రోజువారీ జీవితంలో ఎదుర్కొనే సమస్యలను భావోద్వేగంతో తెరకెక్కించారు. ఈ లఘు చిత్రాన్ని 17వ జైపూర్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించగా, ఉత్తమ బాలల లఘు చిత్రంగా ఎంపికైంది. దీంతో ఆ చిత్ర నిర్మాత, దర్శకురాలైన దేవయానికి నిర్వాహకులు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా దేవయాని మాట్లాడుతూ 'ఎన్నో చిత్రాల్లో నటించినప్పటికీ.. ఒక దర్శకురాలిగా తొలిసారి లఘు చిత్రానికి అవార్డును అందుకోవడం ఎంతో సంతోషంగా ఉంద'న్నారు. ఈ జర్నీలో పాలుపంచుకున్న టెక్నీషియన్లకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.


అవార్డును స్వీకరిస్తున్న దేవయాని

అమెరికా మహిళ ఆధీనంలో ఉన్న విగ్రహాలకు విముక్తి కలిగించండి

● మాజీ ఐజీ పొన్‌మాణిక్యవేల్ డిమాండ్


మీడియాతో మాట్లాడుతున్న పొన్‌మాణిక్యవేల్

టి.నగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన ఓ మహిళ ఆధీనంలో ఉన్న రూ.280 కోట్ల విలువైన 39 ప్రాచీన దేవతామూర్తుల విగ్రహాలకు విముక్తి కలిగించి, వాటిని స్వస్థలానికి చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రాష్ట్ర విగ్రహాల నిరోధక విభాగం మాజీ ఐజీ పొన్ మాణిక్యవేల్ డిమాండ్ చేశారు. తెన్‌కాశి జిల్లా కుట్రాలంలోని కుట్రాలనాథస్వామి ఆలయాన్ని సోమవారం ఆయన దర్శించుకున్నారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పాపాంకుళం ప్రాంతంలోని తిరువెంగాట్టూర్ ఆలయంలోని 700 యేళ్లనాటి వీణానాథ దక్షిణామూర్తి విగ్రహం 45 యేళ్ల క్రితం చోరీకి గురైందని, ఆ విగ్రహం ప్రస్తుతం అమెరికాలోని న్యూయార్క్‌కు చెందిన శుష్మా షెరీన్ అనే మహిళ ఆధీనంలో ఉందని తెలిపారు. ప్రస్తుతం ఆ విగ్రహాన్ని వేలం ద్వారా రూ.12 కోట్లకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఆ విగ్రహాన్ని స్వాధీనం చేసుకోవాలన్నారు. ఆ మహిళ వద్ద రూ.280 కోట్లు విలువచేసే 39 ప్రాచీన దేవతా మూర్తుల విగ్రహాలు కూడా ఉన్నాయని, ఈ వివరాలకు సంబంధించిన తగిన ఆధారాలను ప్రభుత్వానికి సమర్పించినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రాచీన దేవతా మూర్తుల విగ్రహాలను స్వస్థలానికి చేర్చేందుకు రాయబార కార్యాలయ అధికారుల ద్వారా తగు చర్యలు చేపట్టాలని పొన్‌మాణిక్యవేల్ విజ్ఞప్తి చేశారు.

ఆకట్టుకున్న రిపబ్లిక్ డే రిహార్సల్స్



కవాతు చేస్తున్న రాపిడ్ యాక్షన్ ఫోర్స్ - కవాతు నిర్వహిస్తున్న మహిళా పోలీసులు




రాష్ట్ర పోలీసుల కవాతు


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పెరంబూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనాబీచ్ కామరాజర్ రోడ్డులో సోమవారం ఉదయం నిర్వహించిన తొలి విడత రిపబ్లిక్‌డే రిహార్సల్స్ ఆకట్టుకున్నాయి. కార్మికుల విగ్రహ కూడలి వద్ద త్రివిధ దళాలు నిర్వహించిన కవాతు, నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు నిర్వహించారు. కవాతు, నృత్య ప్రదర్శనలు చూసేందుకు తెల్లవారుజాము నుంచే వచ్చిన ప్రజలు, రోడ్డుకు ఇరువైపులా ఉంటూ వారిని ఉత్సాహపరిచారు. ఇదే విధంగా ఎన్‌సీసీ కేడెట్లు, కేంద్ర పారిశ్రామిక భద్రతాదళం, రైల్వే భద్రతాదళం, రాష్ట్ర పోలీసు శాఖ, కమెండో దళం, అగ్నిమాపక సిబ్బంది బ్యాండ్ వాయిద్యాలకు అనువుగా కవాతు నిర్వహించారు. ఇక పాఠశాల విద్యార్థినులు చేసిన శిలంబాట్టం, మయిలాట్టం, ఒయిలాట్టం నృత్యాలు కూడా ప్రేక్షకులను అలరించాయి. ఈ రిహార్సల్స్ కారణంగా ఉదయం ఆరు గంటల నుండి ఎనిమిది గంటల దాకా కామరాజర్‌రోడ్డులో వాహనాల రాకపోకలపై నిషేధం విధించారు. రెండో విడత రిహార్సల్స్ బుధవారం జరుగనున్నాయి.

క్లబ్ అభివృద్ధికి సమష్టి కృషి

● వాసవీ క్లబ్ ఎలైట్ చెన్నై అధ్యక్షుడు డాక్టర్ రమేష్‌బాబు



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

ప్యారీస్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): క్లబ్ అభివృద్ధికి సభ్యులతో కలిసి కృషి చేయనున్నట్లు వాసవీ క్లబ్ ఎలైట్ చెన్నై నూతన అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రమేష్‌బాబు పేర్కొన్నారు. వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ (వి502ఎ) నిర్వహణలోని వాసవీ క్లబ్ 2స్టార్ కేసీజీఎఫ్ ఎలైట్ చెన్నై నూతన అధ్యక్షుడిగా ఎస్.రమేష్‌బాబు, కార్యదర్శిగా మన్నారు ఉదయ్‌కుమార్, కోశాధికారిగా గీతాప్రసాద్ ఒమ్మిన, వనితాక్లబ్ అధ్యక్షురాలిగా టి.జోత్స్న, కార్యదర్శిగా విశాలాక్షి , కోశాధికారిగా జోతిప్రసాద్, అడ్వైజరీ, ఎగ్జిక్యూటివ్ బోర్డుల ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం రాత్రి ఎగ్మోర్‌లో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులు వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ అడ్మిన్ వైస్‌ప్రెసిడెంట్ డా.ఎంవీ నారాయణ గుప్తా, ట్రెజరర్ సుజాత, సభ్యుల సమక్షంలో వి502ఎ జిల్లా గవర్నర్ సీఎం రాజేష్ నూతన కార్యనిర్వాహకులట ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సుజాతా రమేష్‌బాబు ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎరుకుల రామకృష్ణ 2025వ సంవత్సరంలో అమలుపరిచే పథకాల అజెండా వివరించారు. సరస్వతి పథకం ద్వారా ప్రతి క్లబ్ నిర్వాహకులు తమ ప్రాంతంలోని నిరుపేద విద్యార్థులను దత్తత తీసుకొని చదివించాలని సూచించారు. మహిళల విద్యే వాసవీ క్లబ్‌ల ప్రధాన లక్ష్యమని, వారి జీవన శైలి మెరుగుపడేలా పథకాలను విజవంతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమాలకు ముందుగా నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ అజంతా శంకర్‌రావు, తాడేపల్లి రాజశేఖర్, కేఎన్ సురేష్‌బాబు, అమరా చంద్రశేఖర్, బండారం అనంతపద్మనాభన్, రత్నకుమార్, సూరిశట్టి బాలాజీ, కార్తిక్ టిఫిన్ సెంటర్ అధినేత రవిచంద్రన్, రవికుమార్ కుమరవేలు సహా సభ్యుల కుటుంబాలు ఉత్సాహంగా పాల్గొన్నాయి. కార్యక్రమంలో భాగంగా రూ.లక్ష విలువైన సంక్షేమ సహాయాలను లబ్ధిదారులకు అందించి, మెరిట్ విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.

కొరట్టూరులో కిరణ్ ప్యాలెస్ ప్రారంభం


కిరణ్ ప్యాలెస్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు - శాంతి దంపతులు

ప్యారీస్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొరట్టూరు ఈస్ట్ అవెన్యూ టీఎన్‌హెచ్‌బీ కాలనీలో సకల హంగులతో తెలుగు ప్రముఖులు జె.హరికుమార్ - కిరణ్‌కుమారి దంపతులు నిర్మించిన కిరణ్ ప్యాలెస్, బ్యాంకెట్ హాల్‌ను రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్‌బాబు - శాంతి దంపతులు ప్రారంభించారు.వెయ్యిమంది కూర్చొనే సదుపాయంతో హాలు, డైనింగ్ హాలు, బ్యాంకెట్ హాలు, వంద కార్లకు పార్కింగ్ ప్లేస్, 20 ఏసీ గదులతో అత్యాధునిక వసతులతో నిర్మించిన ఈ ప్యాలెస్‌ను ఆదివారం ప్రారంభించిన సందర్భంగా గణపతి హోమం, వాస్తుహోమం, శాంతిహోమంతో పాటు వాసవీ మాతకు ప్రత్యేక పూజలను వేద పండితులు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి శేఖర్‌బాబు దంపతులను హరికుమార్ కుటుంబ సభ్యులు జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హార్బర్ నియోజకవర్గ డీఎంకే ప్రాంతీయ కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ ఎస్.మురళీ, హెచ్.బాలమురుగన్ తదితరులు పాల్గొన్నారు.

అంకాలమ్మ సేవలో దుర్గా స్టాలిన్


మేల్‌మలయనూర్ ఆలయంలో పూజల్లో పాల్గొన్న దుర్గా స్టాలిన్

ప్యారీస్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లాలోని ప్రసిద్ధి చెందిన అంకాలమ్మవారిని ముఖ్యమంత్రి స్టాలిన్ సతీమణి దుర్గా స్టాలిన్ ఆదివారం దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు దుర్గా స్టాలిన్ అమ్మవారి ఆలయానికి చేరుకోగా, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ జీవానందం, ధర్మకర్తల మండలి సభ్యులు ఆమెను ఘనంగా స్వాగతించారు. అమ్మవారి సన్నిధి ముందు కుర్చున్న దుర్గా స్టాలిన్ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ సంప్రాదాయాల ప్రకారం ప్రసాదాలు పంపిణీ చేశారు.

ముగిసిన వైకుంఠ ఏకాదశి వేడుకలు

● వైభవంగా నమ్మాళ్వార్ మోక్ష వైభవం

అడయార్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా శ్రీరంగంలోకి రంగనాథ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ముగిశాయి. ఈ వేడుకలను పురస్కరించుకుని నమ్మాళ్వార్‌కు రంగనాథస్వామి మోక్షాన్ని ప్రసాదించే వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు. వైకుంఠ ఏకాదశి వేడుకలు గత నెల 31వ తేదీ ప్రారంభమయ్యాయి. వైకుంఠద్వార ప్రవేశ ఘట్టం ఈ నెల 10వ తేదీ జరిగింది. ఈ వేడుకల్లో భాగంగా నమ్‌పెరుమాళ్ తీర్థవారి కార్యక్రమం ఆదివారం రాత్రి జరుగగా, నమ్మాళ్వార్‌కు మోక్ష ప్రసాద కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది.

ఈరోడ్ ఈస్ట్‌లో పోటీ నుంచి తప్పుకున్న అన్నాడీఎంకే మాజీ నేత


సెంథిల్ మురుగన్

చెన్నై, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేసి పార్టీ నుంచి బహిష్కరణకు గురైన అన్నాడీఎంకే స్థానిక నేత సెంథిల్ మురుగన్ పోటీ నుంచి తప్పుకున్నారు. సోమవారం నామినేషన్ల గడువు ముగియనున్న సమయంలో ఆయన నామినేషన్ ఉపసంహరించుకున్నారు. పార్టీ నుండి బహిష్కరణకు గురైనా పోటీ నుండి తప్పుకునే పరిస్థితే లేదని ఆదివారం వరకూ చెప్పిన సెంథిల్ మురుగన్ ఆఖరి క్షణంలో మనసు మార్చుకుని నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు.

ఎన్టీకే అభ్యర్థి మైక్ చిహ్నం...

ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న నామ్ తమిళర్ కట్చి (ఎన్టీకే) అభ్యర్థి సీతాలక్ష్మికి ఎన్నికల అధికారులు మైక్ గుర్తు కేటాయించారు. ఈ ఎన్నికల్లో తనకు పార్టీ గత చిహ్నమైన చెరకు రైతు గుర్తు కేటాయించాలని పార్టీ నేత సీమాన్, అభ్యర్థి సీతాలక్ష్మి చేసిన దరఖాస్తులను ఎన్నికల అధికారులు తోసిపుచ్చారు.

ఉప ఎన్నిక బరిలో 47 మంది

పెరంబూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ తూర్పు ఉప ఎన్నికల బరిలో 47 మంది నిలిచారు. ఈ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్ మృతితో ఖాళీ అయిన ఈ నియోజకవర్గ ఉప ఎన్నిక ఫిబ్రవరి 5న నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఈ ఎన్నికను బహిష్కరించనున్నట్లు ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే ప్రకటించగా, బీజేపీ, డీఎండీకే కూడా అదే బాటపట్టాయి. డీఎంకే అభ్యర్థిగా వీసీ చంద్రకుమార్, నామ్ తమిళర్ పార్టీ అభ్యర్థిగా సీతాలక్ష్మి సహా 55 మంది నామినేషన్లు దాఖలుచేశారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారం మధ్యాహ్నం 3 గంటలతో ముగియగా, 8 మంది స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో, డీఎంకే, నామ్ తమిళర్ అభ్యర్థి సహా 47 మంది ఎన్నికల బరిలో నిలిచారు.


చెన్నై కోట్టూరుపురం పల్లిపట్టు ప్రధాన రహదారిలో కార్పొరేషన్ మహిళల కోసం నిర్మించనున్న వ్యాయామశాలకు శంకుస్థాపన చేస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం



చెన్నై కోట్టూరుపురం నుంచి గిండి కలైంజర్ ఆస్పత్రికి మినీ బస్ సర్వీసును ప్రారంభిస్తున్న మంత్రి ఎం. సుబ్రమణ్యం


2016లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కేసు విచారణకు పుదుకోట కోర్టులో హాజరై వస్తున్న ఎండీఎంకే నేత వైగో

డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ, పద్మావతి డిగ్రీ కాలేజీకి చెందిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు ఇందుకు సంబంధించిన ఫలితాలను విడుదల చేశారు. ఈ కాలేజీలకు స్వయం ప్రతిపత్తి హోదా లభించిన నేపథ్యంలో తొలిసారిగా స్వయంగా కాలేజీలే పరీక్షలు నిర్వహించి, ఫలితాలను ప్రకటించాయి. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులు 54.2 శాతం, పద్మావతి డిగ్రీ కాలేజీ విద్యార్థులు 81 శాతం ఉత్తీర్ణత సాధించారు.



ఆలయం ముందు అశ్విన్‌బాబు, బాబీ, తమన్

స్వామివారు.. పెద్ద బ్లాక్‌బస్టర్ ఇచ్చారు

'డాకు మహారాజ్' దర్శకుడు బాబీ

తిరుమల, జనవరి20(ఆంధ్రజ్యోతి): 'డాకు మహారాజ్'తో శ్రీవేంకటేశ్వరస్వామి చాలా పెద్ద బ్లాక్‌బస్టర్ ఇచ్చారని ఆ చిత్ర దర్శకుడు బాబీ సంతోషం వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు తమన్, నటుడు అశ్విన్ బాబుతో కలిసి ఆయన సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. రెండేళ్ల క్రితం 'వాల్తేరు వీరయ్య' సినిమాతో వచ్చామని, అప్పుడూ స్వామివారు మంచి విజయాన్ని ఇచ్చారన్నారు. తాజాగా 'డాకు మహారాజ్'ను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి థ్యాంక్స్ చెబుతున్నానన్నారు. తొలి నుంచే ఈ సినిమాపై చాలా ఆశలు పెట్టుకున్నామని తమన్ అన్నారు. అందుకే స్వామికి థ్యాంక్స్ చెప్పేందుకు వచ్చామన్నారు. శ్రీవారి ఆశీస్సులు లేకుండా ఏదీ ప్రారంభించనన్నారు.


శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

శనివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.68 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,826

తలనీలాలు సమర్పించినవారు: 22,625







పిల్లల కేరింతలు..


పిట్టల కిలకిలలు..















కళకళలాడిన నేలపట్టు

చెరువు కట్టల మీద విద్యార్థుల కేరింతలూ.. చెరువులోని చెట్లమీద పిల్లపక్షుల కిలకిలలూ.. ఫ్లెమింగో ఫెస్టివల్ మూడోరోజున నేలపట్టు కళకళలాడింది. రకరకాల యూనిఫారాల్లో ఎటు చూసినా పిల్లలే సందడిగా కనిపించారు. చెరువులోని చెట్లమీద రకరకాల పక్షి పిల్లలు ముక్కులతో పొడుచుకుంటూ, రెక్కలు విప్పుకుని ఎగరడం నేర్చుకుంటూ, చెరువులో వాలి జలకాలాటలాడుతూ అలరించాయి. సెప్టెంబరు నుంచీ వివిధ దేశాల నుంచీ విడతలవారీగా వస్తున్న పక్షులు ఈ చెట్లమీద గూళ్లు పెట్టుకుని, సహచరులను ఆకర్షించి జతకట్టి, గుడ్లుపెట్టి పొదిగాయి. ఇప్పుడీ పిల్లలు రెండు నెలల వయసుకు చేరుకున్నాయి. బుజ్జి పిట్టల బొజ్జనింపి బువ్వపెట్టేందుకు అమ్మ పక్షులు ఆహారం వెతుకుతూ వెళ్లిపోయాయి. ఈ పిల్ల పిట్టలు ఎండకు రెక్కలార్చుకుంటూ, ముక్కులు పదును పెట్టుకుంటూ గడుపుతున్నాయి. ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌లు తమ కెమెరాల్లో బంధించారు.

ఘనంగా జరిగిన ఫ్లెమింగో ఫెస్టివల్

మూడు రోజులూ పోటెత్తిన జనం










ఉల్లాసంగా ఉత్సాహంగా పడవల్లో..





తడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పక్షుల పండుగ చివరిరోజు సోమవారం పర్యాటకులతో పులికాట్ సరస్సు పులకించిపోయింది. పెద్ద సంఖ్యలో పర్యాటకులు విద్యార్థులు పడవ షికారుకు ఉత్సాహం చూపారు. కాళహస్తి, గూడూరు, నాయుడుపేట, వెంకటగిరి పరిసర ప్రాంతాల నుంచి పాఠశాలల విద్యార్థులు ప్రత్యేక బస్సుల్లో పడవ షికారుకు వచ్చారు. పులికాట్ తీరాన నీళ్లలో ఉత్సాహంగా గంతులు వేశారు. ఇక్కడి వేదికమీద స్థానిక విద్యార్థులతో పాటు కొందరు చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చివరిరోజున సాయంత్రం 6 గంటల వరకు పడవ షికారు జరిగింది.

పడవ షికారు అద్భుతం



పులి కాట్‌లో పడవలో తిరగడం ఆనం దంగా ఉంది. ఎటు చూసినా నీళ్లే. ఇదే తొలిసారి నేను పడవ ఎక్కడం. నేలపట్టులో పక్షులను చూసి ఇక్కడికి వచ్చాం. ఎన్ని పక్షులో అక్కడ!

- తేజశ్విని, 6వ తరగతి, పెద్దకన్నలి, తొట్టంబేడు మండలం

సూళ్లూరుపేటలో సందడే సందడి

సూళ్లూరుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగ చివరిరోజు పర్యాటకులతో కళాశాల మైదానం సందడిగా కనిపించింది. పలు ప్రాంతాల విద్యార్థులు, పర్యాటకులు స్టాల్స్‌ను చూస్తూ ఎంజాయ్ చేశారు. ముఖ్యంగా షార్ రాకెట్‌లను చూస్తూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సోమవారం సైతం పర్యాటకుల కోసం పూర్తి స్థాయిలో బస్సులు ఏర్పాటు చేయలేకపోయారు. దీంతో ఆటోలే దిక్కుఅయ్యాయి. కళాశాల మైదానం చుట్టుపక్కల రోడ్లను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని భద్రతా ఏర్పాట్లు చేశారు.

ఆటల వేదికలా అటకానితిప్ప



పర్యావరణం కాపాడటంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఓజిలి/సూళ్లూరుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అటకానితిప్ప ప్రాంతంలో పక్షులను చూసేందుకు సోమవారం విద్యార్థులు, సందర్శకులు పెద్ద సంఖ్యలో వచ్చారు. సత్యవేడు, పల్లమాల, బాకరాపేట, పలమనేరు, చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి వందలాదిగా విద్యార్థులు తరలిరావడంతో అటకానితిప్ప కిటకిటలాడిపోయింది. ఇక్కడ పిల్లల వినోదం కోసం ఏర్పాటు చేసిన ప్రదేశంలో ఆటల్లో పిల్లలు సందడిగా గడిపారు. పక్షుల ప్రదర్శనశాలలో పులికాట్, అటకానితిప్ప, నేలపట్టు, సమీప ప్రాంతాల విశిష్టతపై ప్రదర్శించిన ఫిల్మ్‌షోను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. విద్యార్థుల సందేహాలకు సిబ్బంది సమాధానాలు ఇచ్చి మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, పక్షులపై అవగాహన కల్పించారు. ఈ ప్రాంతానికి సమీపంలో పులికాట్‌లో నీరు ఎండిపోవడంతో పక్షులు దూరంగా వెళ్లిపోవడంతో సందర్శకులు ఒకింత నిరాశకు గుయ్యారు.

సంతోషంగా ఉంది



ఫ్లెమింగో ఫెస్టివల్‌కు రావడం వల్ల చాలా తెలుసుకున్నాం. అటకానితిప్పలో ఫిల్మ్‌షో చాలా బావుంది. బీవీపాళెం రేవులో పడవ ప్రయాణం వింత అనుభూతిని ఇచ్చింది.

- టి నందిని, 10వ తరగతి, ఇరుగుళం స్కూల్, సత్యవేడు మండలం.







అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్

తడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక కార్యక్రమాలతో జనం ఉర్రూతలూగారు. బుల్లితెర యాంకర్లు రవి, కావ్య, అమూల్య మాటల గారడీలతో ఆకట్టుకోగా.. మిమిక్రీ రాజు తన మిమిక్రీతో జనాలను కట్టిపడేశారు. మల్కాట్‌సింగ్ చేసిన నృత్య ప్రదర్శన అబ్బురపరచింది. సినీ గాయని మంగ్లీ తన ఆటపాటలతో జనాలను హుషారెత్తించారు.



ప్రకృతిని.. సంస్కృతిని తల్లిలా చూడాలి

ముఖ్య అతిథిగా వచ్చిన సినీ హీరోయిన్ సంయుక్త మీనన్ 'హాయ్' అంటూ సభికులను పలకరించారు. ప్రకృతి, సంస్కృతిని తల్లిలా చూడాలన్నారు. ప్రకృతిని కాపాడుకోవడం మన బాధ్యతన్నారు. వాటర్ బాటిల్ పారవేయడం తేలికని, దాని ద్వారా పర్యావరణం దెబ్బతింటుందని గుర్తించాలన్నారు. మరో సినీ హీరోయిన్ కృతిశెట్టి మాట్లాడుతూ.. మన సంస్కృతిని ఎన్నో దేశాలు ఆహ్వానిస్తుంటాయని, మనంకూడా సోషల్ మీడియాలో దీనిని బాగా ప్రమోట్ చేసేలా కృషి చేయాలని కోరారు.

వైద్య పరీక్షలు పక్కాగా నిర్వహించండి

తిరుపతి(వైద్యం), జనవరి 20(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా చిన్నపాటి వ్యాధులతో ఆస్పత్రులకు వచ్చే రోగులకు వైద్య పరీక్షలు తప్పక నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి బాలకృష్ణనాయక్ అన్నారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం ఆయన మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ క్యాలెండరును ఆవిష్కరించారు. రోగులకు వైద్యం అందించడంలో రక్త పరీక్షలు ప్రధానమని, వాటిని పక్కాగా నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు వినయ్, హరి, శ్రీకాంత్, ప్రభు పాల్గొన్నారు.

సామాజిక సేవ చేయాలనుంది

మిస్ గ్లోబల్ భావనారెడ్డి



తిరుపతి(ఆటోనగర్), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవ కార్యక్రమాలు చేస్తానని మిస్ గ్లోబల్ పి.భావనారెడ్డి తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ బాల్యం నుంచే అన్ని రంగాల్లో రాణిస్తున్నానని తెలిపారు. ఫ్యాషన్ రంగంలో రాణించాలన్న తన సంకల్పం ఫలించిందన్నారు. దేశం గర్వించే స్థాయికి ఎదగాలన్న ఆకాంక్ష ఉందన్నారు. తాను స్థాపించిన మిత్రా ఫౌండేషన్ సంస్థ ద్వారా సామాజిక సేవ చేస్తామని చెప్పారు. త్వరలోనే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి కొల్లు రవీంద్రలను కలసి తాను చేపట్టబోయే సేవా కార్యక్రమాల గురించి వివరిస్తానన్నారు. సమావేశంలో ఆమె తండ్రి గోపీకృష్ణ, పి.మోహన్‌రెడ్డి, రాజేష్‌లు పాల్గొన్నారు.